**తెలంగాణ సాయుధ పోరాటానికి** ఆజ్యం పోసింది ఇక్కడే... రజాకార్లకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం చేసింది ఇక్కడే... తెలంగాణలో మొట్టమొదటి ఎన్‌కౌంటర్ జరిగిందీ ఇక్కడే... దివంగత దేశ ప్రధాని వీవీ నర్సింహారావు ఇక్కడి వాడే... ఆసియాలోనే రెండో అతిపెద్ద అమరవీరుల స్తూపం కట్టింది ఇక్కడే... తెలంగాణ ఉద్యమంలోనూ కదం తొక్కి ఉద్యమాన్ని పూరించింది ఇక్కడి ప్రజలే... కమ్యూనిస్టుల కంచుకోటగా పేరుగాంచిన ఈ నియోజకవర్గం ప్రస్తుతం గులాబీ వాసనలను గుబాళిస్తూ వెనుబడ్డ ప్రాంతం నుంచి అభివృద్ధి చెందిన ప్రాంతంగా ఎదుగుతోంది...అదే హుస్నాబాద్ నియోజకవర్గం. ఒకప్పుడు పోరాటాలు, ఉద్యమాలకు నిలయంగా ఉన్న హుస్నాబాద్ నియోజకవర్గం ప్రస్తుతం ప్రశాంతంగా ఉండి అభివృద్ధి చెందిన ప్రాంతంగా రూపుదిద్దుకుంటోంది. మొదట నుస్తులాపూర్ నియోజకవర్గంగా ఉన్న ఈ ప్రాంతం.. అనంతరం ఇందుర్తి నియోజకర్గంగా ఆ తర్వాత హుస్నాబాద్ నియోజకవర్గంగా మారింది. కమ్యూనిస్టు, కాంగ్రెస్ పార్టీల కంచుకోటలో బీఆర్ఎస్ పాగా వేసింది.

– హుస్నాబాద్, నవంబర్ 7

# ఎర్రకోటలో గులాబీ పాగా


నుస్తులాపూర్ నియోజకవర్గం నుంచి హుస్నాబాద్ వరకు వైవిధ్యమైన తీర్పు ఇచ్చిన ఓటర్లు

## ఉద్యమాల పురిటిగడ్డపై రెండుసార్లు ఎగిరిన గులాబీ జెండా




- ఆరుసార్లు సీపీఐ, ఐదుసార్లు కాంగ్రెస్, రెండుసార్లు బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు
- ఐదుసార్లు మినహా ప్రతీసారి విపక్ష ఎమ్మెల్యేలే ఎన్నిక
- గులాబీ జెండా నీడలో అభివృద్ధి పరుగులు
- మారిన హుస్నాబాద్ నియోజకవర్గ రూపురేఖలు
- 1952లో మొదటి అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పాటు...

**హుస్నాబాద్ నియోజకవర్గం రౌండప్**



1952లో నుస్తులాపూర్ నియోజకవర్గం ఏర్పడగా, ఇందులో ఇప్పటి కరీంనగర్‌లోని తిమ్మాపూర్ మండలంతో పాటు చిగురుమామిడి, హుస్నాబాద్, కోహెడ, బెజ్జంకి మండలాలతో కలిపి ఉండేవి. 1957లో ఇందుర్తి నియోజకవర్గంగా మారినప్పుడు హుస్నాబాద్, చిగురుమామిడి, బెజ్జంకి, కోహెడ మండలాలు ఉండేవి. 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా దీనిని ఆరు మండలాలతో కలిపి హుస్నాబాద్ నియోజకవర్గంగా మార్చారు. ఇందులో ప్రస్తుతం కరీంనగర్ జిల్లాలోని చిగురుమామిడి, సైదాపూర్, హనుమకొండ జిల్లాలోని ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్, కోహెడ మండలాలు ఉన్నాయి. అక్కన్నపేట మండలం కొత్తగా ఏర్పడటంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఏడు మండలాలు ఉన్న రెండో అతిపెద్ద నియోజకవర్గంగా మారింది. 2011జనాభా లెక్కల ప్రకారం నియోజకవర్గం జనాభా 3,05,333, మొత్తం ఓటర్లు 2,11,115 మంది ఉన్నారు. ఓటర్ల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది.

### ఎక్కువసార్లు గెలిచింది వామపక్షాలే..

నుస్తులాపూర్ నియోజకవర్గం నుంచి ఇప్పటి వరకు 14సార్లు ఎన్నికలు జరిగాయి. ఐదుసార్లు మినహా మిగతా ప్రతి సారి ప్రభుత్వేతర ఎమ్మెల్యేలను గెలిపించడం ఇక్కడి ఓటర్ల ప్రత్యేకతగా చెప్పొచ్చు. 1952లో నుస్తులాపూర్ నుంచి పీడీఎఫ్ అభ్యర్థి సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, 1957లో ఇందుర్తి నియోజకవర్గం నుంచి పీడీఎఫ్ అభ్యర్థి చామనపల్లి చొక్కారావు విజయం సాధించగా రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. 1962, 1967లో కాంగ్రెస్ అభ్యర్థి బొప్పరాజు లక్ష్మీకాంతరావు విజయం సాధించగా రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. 1972లో సీపీఐ అభ్యర్థి బద్దం ఎల్లారెడ్డి, 1978లో సీపీఐ అభ్యర్థి దేశిని చినమల్లయ్య గెలిచినప్పుడూ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ఉంది. 1983లో కాంగ్రెస్ అభ్యర్థి బొప్పరాజు లక్ష్మీకాంతారావు గెలువగా రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చింది.1985, 1989, 1994లో జరిగిన ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థి దేశిని చినమల్లయ్య వరుసగా మూడుసార్లు గెలిచినప్పుడు కాంగ్రెస్, టీడీపీలు పాలనలు ఉన్నాయి. 1999లో కాంగ్రెస్ అభ్యర్థి బొమ్మ వెంకటేశ్వర్ గెలుపొందగా రాష్ట్రంలో టీడీపీ అధికారంలో ఉంది. 2004లో సీపీఐ అభ్యర్థి చాడ వెంకటరెడ్డిని గెలిపిస్తే రాష్ట్రంలో కాంగ్రెస్ ఉంది. 2009 నుంచి మాత్రం నియోజకవర్గం దశ తిరిగిందని చెప్పొచ్చు. 2009లో కాంగ్రెస్ అభ్యర్థి అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, 2014, 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి వొడితెల సతీశ్‌కుమార్ గెలుపొందగా.. ఈ ఇద్దరూ అధికార పార్టీ ఎమ్మెల్యేలుగా ఉన్నారు. విపక్ష ఎమ్మెల్యేలే ఎక్కువ ఉన్నందున నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిందని చెప్పొచ్చు. మొత్తం 14సార్లు ఎన్నికలు జరగగా రెండు సార్లు పీడీఎఫ్, ఐదుసార్లు కాంగ్రెస్, ఆరుసార్లు సీపీఐ, రెండుసార్లు బీఆర్ఎస్ గెలుపొందింది.

**నియోజకవర్గం నుంచి ఇప్పటి వరకు గెలుపొందిన ఎమ్మెల్యేల వివరాలు...**

| సంవత్సరం | నియోజకవర్గం | గెలుపొందిన అభ్యర్థి | పార్టీపేరు |
|---|---|---|---|
| 1952 | నుస్తులాపూర్ | సింగిరెడ్డి వెంకటరెడ్డి | పీడీఎఫ్ |
| 1957 | ఇందుర్తి | చామనపల్లి చొక్కారావు | పీడీఎఫ్ |
| 1962 | ఇందురి | బి.లక్ష్మీకాంతరావు | కాంగ్రెస్ |
| 1967 | ఇందురి | బి.లక్ష్మీకాంతరావు | కాంగ్రెస్ |
| 1972 | ఇందుర్తి | బద్దం ఎల్లారెడ్డి | సీపీఐ |
| 1978 | ఇందుర్తి | దేశిని చిన్నమల్లయ్య | సీపీఐ |
| 1983 | ఇందుర్తి | బి.లక్ష్మీకాంతరావు | కాంగ్రెస్ |
| 1985 | ఇందుర్తి | దేశిని చిన్నమల్లయ్య | సీపీఐ |
| 1989 | ఇందుర్తి | దేశిని చిన్నమల్లయ్య | సీపీఐ |
| 1994 | ఇందుర్తి | దేశిని చిన్నమల్లయ్య | సీపీఐ |
| 1999 | ఇందుర్తి | బొమ్మ వెంకటేశ్వర్లు | కాంగ్రెస్ |
| 2004 | ఇందుర్తి | చాడ వెంకటరెడ్డి | సీపీఐ |
| 2009 | హుస్నాబాద్ | అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి | కాంగ్రెస్ |
| 2014 | హుస్నాబాద్ | వొడితెల సతీశ్‌కుమార్ | బీఆర్ఎస్ |
| 2019 | హుస్నాబాద్ | వొడితెల సతీశ్‌కుమార్ | బీఆర్ఎస్ |

### బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక అభివృద్ధి వైపు అడుగులు...

2014లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఇదే పార్టీకి చెందిన ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందడంతో నియోజకవర్గానికి నిధుల వరద పారిందని చెప్పొచ్చు. కరువు కాటకాలతో అల్లాడే హుస్నాబాద్ నియోజకవర్గం వరప్రదాయిని గౌరవెల్లి రిజర్వాయర్ నిర్మాణం పూర్తయింది. సాగునీటి కోసం అల్లాడే మెట్ట హుస్నాబాద్ సస్యశ్యామలం కాబోతోంది. నియోజకవర్గంలో రూ.5వేల కోట్లకు పైగా అభివృద్ధి పనులు, రూ.4వేల కోట్లకు పైగా సంక్షేమ పథకాల అమలయ్యాయి. మొత్తంగా రూ.9వేల కోట్లకు పైగా అభివృద్ధి జరిగింది. మహాసముద్రంగండి నిర్మాణం, శనిగరం, సింగరాయ ప్రాజెక్టులకు మరమ్మతులు జరగడం, ఎల్లమ్మ చెరువు మినీట్యాంక్‌బండ్‌గా రూపుదిద్దుకోవడం, మిషన్ కాకతీయతో చెరువుల పునర్నిర్మాణం జరిగింది. ఆయా నీటి వనరుల ఆయకట్టు ప్రాంతాలు పచ్చని పంటలతో అలరారుతున్నాయి. గతంలో ఎన్నడూ లేనంతగా సగటును ఒక్కో గ్రామానికి రూ.60లక్షలకు పైగా నిధులు వచ్చాయి. ఈ నిధులతో గ్రామాల్లో పెద్ద ఎత్తున సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణం జరిగింది. ఎండకాలం వచ్చిందంటే బిందెలు పట్టుకొని రోడ్లపైకి వచ్చే మహిళలు గడిచిన తొమ్మిదిన్నరేండ్లలో ఎక్కడా కనిపించలేదు. సీఎం కేసీఆర్ కలల ప్రాజెక్టు మిషన్ భగీరథ హుస్నాబాద్ లాంటి మెట్ట ప్రాంతాల ప్రజల దాహార్తిని తీర్చింది. ఇంటి ముంగిటికి శుద్ధజలం వచ్చింది. ప్రజావసరాలకు అనుగుణంగా నిధుల కేటాయింపులు జరగడంతో కరువు ప్రాంతంగా ఉన్న హుస్నాబాద్ అభివృద్ధి చెందిన ప్రాంతంగా మారిందనడంలో సందేహం లేదు.

# చేరికల జోరు

## కాంగ్రెస్, బీఎస్పీ, బీజేపీకి షాక్

- అక్కన్నపేట, భీమదేవరపల్లి, హుస్నాబాద్ మండలాల్లో ప్రతిపక్షాలు ఖాళీ
- హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ సమక్షంలో బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

హుస్నాబాద్, నవంబర్ 7: హుస్నాబాద్ నియోజకర్గంలో కాంగ్రెస్, బీఎస్పీ, బీజేపీకి షాక్ తలిగింది. హుస్నాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ సమక్షంలో నియోజకవర్గంలోని అక్కన్నపేట, భీమదేవరపల్లి, హుస్నాబాద్ మండలాల నుంచి కాంగ్రెస్, బీఎస్పీ, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. అక్కన్నపేట మండల బీఎస్పీ అధ్యక్షుడు అరవింద్ ఆధ్వర్యంలో మరో 20మంది కార్యకర్తలు ఆ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరారు. ఇదే మండలంలోని చౌటపల్లికి చెందిన 20మంది కాంగ్రెస్ కార్యకర్తలు గులాబీ కండువా కప్పుకున్నారు. భీమదేవరపల్లి మండల గౌడ సంఘం నాయకులు 20మందికి పైగా గులాబీ పార్టీలో చేరారు. హుస్నాబాద్ మండలం పొట్లపల్లికి చెందిన వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరగా వారందరికీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నేతృత్వంలో పదేండ్లలో తెలంగాణ రాష్ట్రానికి దేశంలోనే నంబర్‌వన్ స్థానం లభించిందన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి బీఆర్ఎస్‌లో చేరేందుకు వివిధ పార్టీల నుంచి భారీగా వస్తున్నారని చెప్పారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి ప్రజలందరికీ తెలుసునని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల ఆశీర్వాదంతో మళ్లీ గులాబీ జెండా ఎగరడం ఖాయమన్నారు. అక్కన్నపేట ఎంపీపీ మాలోతు లక్ష్మీ, జడ్పీటీసీ భూక్యా మంగ, భీమదేవరపల్లి జడ్పీటీసీ వంగ రవీందర్, హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల బీఆర్ఎస్ అధ్యక్షులు వంగ వెంకట్రామ్‌రెడ్డి, పెసరు సాంబరాజు, ఎన్ఎల్‌సీఎఫ్ డైరెక్టర్ రాజ్యలక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు బీలూనాయక్, తిరుపతిరెడ్డి, వెల్డి శోభారంగారావు, నర్సింహారెడ్డి, వెంకటస్వామి, మల్లయ్య, చుక్క శ్రీనివాస్, పాకాల శ్యామ్, ఇంతియాజ్, శంకర్, వాల నవీన్ పాల్గొన్నారు.



హుస్నాబాద్ మండలం పొట్లపల్లికి చెందిన వివిధ పార్టీల నాయకులకు గులాబీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్